
సాక్షి పల్నాడు

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



కొనసాగుతున్న సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. పలు విభాగాలకు చెందిన దివ్యాంగులు పరీక్షలు చేయించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 517.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 3,031 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి నిత్యాన్నదానానికి కావూరుకు చెందిన తుమ్మల సాయి రాఘవ్ రూ. లక్ష విరాళాన్ని గురువారం అందజేశారు.

న్యూస్‌రీల్

న్యాయవ్యవస్థకు ప్రజలకు మధ్య పారా వలంటీర్లు వారధులు

13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ



నరసరావుపేటటౌన్: న్యాయవ్యవస్థకు, ప్రజలకు మధ్య వారధిలా ఉండి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. సత్యశ్రీ పేర్కొన్నారు. గురువారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో పారా లీగల్ వలంటీర్లకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆమె మాట్లాడారు. పారా లీగల్ వలంటీర్ల విధులు, నైతికత, రాతపూర్వక నైపుణ్యం, రోజువారి జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను, చట్టపరమైన సలహాలు ఇచ్చే విధివిధానాలను గురించి వివరించారు. న్యాయవ్యవస్థకు ప్రజలకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరించి ప్రజలకు చట్టాలపై కనీస అవగాహన కల్పించేలా కృషి చేయాలని సూచించారు.

ధాన్యం సేకరణ లక్ష్యం 10వేల మెట్రిక్ టన్నులు

నరసరావుపేట: రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ 10వేల మెట్రిక్ టన్నులు లక్ష్యంగా నిర్దేశించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం సేకరణ సమావేశం వివిధ శాఖల అధికారులతో నిర్వహించారు. రబీలో 2024-25 సంవత్సరానికి 234 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 20,561 హెక్టార్లలో వరిసాగు చేశారన్నారు. దీనిలో 1,32,773 ఎంటీల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయటం జరిగిందన్నారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటా రూ.2320లు, సాధారణ రకం క్వింటా రూ.2300లుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులు కనీస మద్దతు ధర పొందాలంటే ఈ-పంట ద్వారా పంటను నమోదుచేయించి 100శాతం ఈకేవైసీ చేయించాలన్నారు. మాయిశ్చర్ మీటర్లను త్వరగా కాలిబ్రేషన్ చేయించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నారదమునిని ఆదేశించారు. రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లు సామర్థ్యం, ఇతర వివరాలు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలన్నారు. ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, రైతులు కొనుగోలుకేంద్రాల ద్వారా తాము పండించిన పంటను విక్రయించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, జిల్లా సప్లయీస్ మేనేజర్, ఏపీ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ప్రతినిధులు, మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్, రైస్ మిల్లర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం



నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో వారం రోజుల పాటు దాదాపు 1.75లక్షల పేపర్లు మూల్యాంకనం చేయనున్నారు. దాదాపు 1050మంది ఉపాధ్యాయులు మూల్యాంకనంలో పాల్గొంటున్నారు. సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గదుల్లో అదనపు వెలుతురు, గాలి వచ్చేలా లైట్లు, స్టాండ్ ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది, 108 అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

5, 6 తేదీల్లో ఇంటర్ దూరవిద్య మూల్యాంకనం

సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 5, 6తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురువారం తెలిపారు. కాసు బ్రహ్మానందరెడ్డి కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రంలో రెండు రోజుల పాటు 11 సబ్జెక్ట్‌లకు సంబంధించిన 16,215 పేపర్లు మూల్యాంకనం చేయనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను 191 మంది ఎగ్జామినర్లు, 38 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 39 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించినట్లు తెలిపారు.

7 నుంచి దూరవిద్య ప్రాక్టికల్స్..

ఇంటర్మీడియెట్ దూరవిద్య ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 7వతేదీ నుంచి 11వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ తెలిపారు. ఆయా తేదీలలో ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ఇందుకుగాను నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండలో 6 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అన్నదాతకు అకాల కష్టం

- కోతకొచ్చిన రబీ వరి పంట
- కళ్లాల్లోనే మిర్చి, కంది
- ధాన్యం కాపాడుకునేందుకు రైతుల తంటాలు
- వర్షం దెబ్బకి ధాన్యాన్ని నష్టానికి అమ్ముకున్న కొందరు రైతులు

పలుచోట్ల వర్షంతో అవస్థలు



ఒప్పిచర్లలో కళ్లంలో ఉన్న ధాన్యాన్ని గోతాలకు పడుతున్న కూలీలు

కారెంపూడి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో కర్షకులు నానా అవస్థలు పడ్డారు. నోటి దగ్గరకొచ్చిన పంటను కాపాడుకోడానికి రైతులు పడరాని పాట్లు పడ్డారు. కారెంపూడి మండలంలో కళ్లాల్లో ఉన్న మిర్చి, ధాన్యం, కందులు తడిసి పోకుండా వాటిని కుప్పలుగా చేసి పట్టలు కప్పడంలో రైతులు తలమునకలయ్యారు. పట్టలు తీసుకుని పొలాలకు ఉరుకులు పరుగులు పెట్టి పొలాలలో కళ్లలలో ఉన్న పంట ఉత్పత్తులు తడిసిపోకుండా పట్టలు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు. మబ్బులు పట్టగానే కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని, మిర్చిని చాలా మంది వచ్చిన ధరకు తెగనమ్మేశారు. కొందరు ఇప్పటికే కళ్లాల్లో ఆరిన పంటలను గోతాలకు పట్టి ఇళ్లు చేర్చుకున్నారు.

మాచర్లలో భారీ వర్షం

మాచర్ల: అత్యధిక ఎండతో ఇబ్బంది పడుతున్న మాచర్ల వాసులకు మారిన వాతావరణం కాస్తంత ఉపశమనం కలిగించింది. గురువారం మధ్యాహ్నం వాతావరణంలో ఆకస్మికంగా మార్పు వచ్చి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు సేద తీరారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు పారింది.

కోతకు రబీ వరి.. కళ్లాల్లో మిర్చి, కంది

ఉరుములు మెరుపులతో కూడిన వర్షంతో రైతుల గుండెలు ఝల్లుమన్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఎక్కడ తడిసిపోతాయోనని వాటిని కాపాడుకోడానికి అష్టకష్టాలు పడ్డారు. మరో వైపు కంది కళ్లాలు జరుగుతున్నాయి. కళ్లాలను త్వరగా పూర్తి చేసేందుకు రైతు కూలీలు కష్టపడ్డారు. వర్షం రాకతో కళ్లం చేసిన గింజలతో కూడిన పొట్టును మిషన్‌లో పోసే అవకాశం కూడా లేకుండా పోయింది. మిరప కాయల కోతలు కూడా జరుగుతున్నాయి. దీంతో కోసిన కాయలు తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకున్నారు. మరో వైపు రబీ వరి చేలన్నీ కోతకు వచ్చాయి. ఈ దశలో వర్షం పడితే గింజ పాడైపోతుందని, గింజలు నేలపాలు అవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఎరువుల కొట్లలో బాకీలున్న చిన్న సన్నకారు రైతులు కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని జిలకర సన్నాలు 75 కిలోల బస్తా రూ.1540కే తెగనమ్మారు. అమ్ముదామంటే ధర లేదు.. కొనేనాథుడు లేడని వర్షం వల్ల బతిమాలి మరీ పంటను అమ్మాల్సిన దుస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఒప్పిచర్లలో మిర్చి బస్తాలను లారీలకు ఎక్కిస్తున్న కూలీలు



కారెంపూడిలో కందులు తడవకుండా కప్పిన పట్ట

15 శాతం వృద్ధిరేటే లక్ష్యం

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నరసరావుపేట: జిల్లాలో 2025-26 ఆర్థిక ఏడాదిలో 15 శాతం వృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టనున్నామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. ప్రధానంగా ఉద్యాన పంటలు, పశు పోషణ, పర్యాటక రంగాలలో అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడంపై దృష్టిసారిస్తామన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జిల్లా అభివృద్ధి, ఉపాధి హామీ ప్రణాళికపై మాట్లాడారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం 20వేలు హెక్టార్లకు పెంచనున్నామన్నారు.

పంచ ప్రాధాన్యత కార్యక్రమాలు..

అన్ని అనుమతులు పొంది వివిధ కారణాల చేత నిలిచిపోయిన పరిశ్రమలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవటం ద్వారా ఉపాధి అవకాశాలతో పాటూ పారిశ్రామిక వృద్ధి సాధించగలమన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఒక నూతన హోటల్ ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలవనున్నామన్నారు. వేసవిలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని ఉపాధిహామీ పథకంలో పంచ ప్రాధాన్యతా కార్యక్రమాలు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అన్ని చెరువులలో కనీస అవసరాలకు తగ్గట్టు నీరు నింపడం, కాల్వల పూడికతీత పనులు చేపడతామన్నారు. మొత్తం 6500 ఫామ్ పాండ్ల నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి పాల్గొన్నారు.

రెండు హాస్పిటళ్లకు జరిమానా..

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలపై రోగుల నుంచి డబ్బులు వసూలుచేసిన రెండు హాస్పిటళ్లకు జరిమానా విధించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్‌కుమార్ అధ్యక్షతన జిల్లా క్రమశిక్షణా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు సుమారు 30 ఫిర్యాదులను పరిశీలించారు. రోగులకు నగదు రహిత వైద్యసేవలు అందించేలా ఆసుపత్రి యాజమాన్యాలు తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు దరఖాస్తులు..

నరసరావుపేట: జిల్లాలో ఈ ఏడాది జనవరి ఆరు నుంచి ఏప్రిల్ మూడవ తేదీవరకు నిర్వహించిన ఓటర్ల జాబితా సవరణలో భాగంగా అన్ని రకాల ఫారాల క్లెయిములు 2995 ఉన్నాయని, అందులో నూతన ఓటర్లు 296 మంది, తొలగింపులు 2280 ఉండగా, మార్పులుకు 416 అందాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం ఓటర్ల జాబితా సవరణలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం చేపడుతున్న పలు విధానాలను ఎప్పటికప్పుడు తెలియచేసే విధంగా ప్రతి నెల సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ నిరంతరంగా జరుగుతుందన్నారు.

బర్డ్‌ఫ్లూ పై ఆందోళన వద్దు

నరసరావుపేట: నరసరావుపేట పట్టణంలోని బాలయ్యనగర్‌లో చోటుచేసుకున్న రెండేళ్ల బాలిక పెండ్యాల ఆరాధ్య బర్డ్ ఫ్లూ మరణంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆందోళన చెందాల్సిన అవసరంలేదని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పలు అంశాలపై నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బర్డ్‌ఫ్లూ ప్రస్తావన చేశారు. ఇక్కడికి బయటి ప్రాంతాల నుంచే కోళ్లు వస్తున్నాయని, స్థానికంగా ఎక్కడా లేవన్నారు. జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూతో కోళ్లు చనిపోయిన ఉదంతం లేదని చెప్పారు. కాగా, బాలయ్యనగర్‌లో మూడోరోజు గురువారం కూడా వైద్యశిబిరం నిర్వహించారు. రావిపాడు-2 కిందకు వచ్చే పీహెచ్‌సీ డాక్టర్ జోయల్ ప్రభాకర్ నేతృత్వంలో ఏఎన్ఎంలు, ఆశాలు 123 గృహాలను సందర్శించి జ్వర పీడితుల వివరాలను సేకరించారు.

కన్నకొడుకే కాలయముడు

- మతి స్థిమితం లేని తల్లిని చంపిన కొడుకు
- మంచంపై నిద్రిస్తుండగా రోకలి బండతో మోది హత్య



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ ప్రభాకర్



మృతిచెందిన గజ్జ సోమమ్మ

బొల్లాపల్లి: కన్న కొడుకు చేతిలో జన్మనిచ్చిన తల్లి దారుణంగా హత్యకు గురైన సంఘటన పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామంలో గురువారం జరిగింది. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్, బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... వెల్లటూరు గ్రామానికి చెందిన గజ్జ చిన్న నరసయ్య, గజ్జ సోమమ్మ (67) దంపతులకు ముగ్గురు మగ, ఇద్దరు ఆడ సంతానం. చిన్న కుమారుడు బాదరయ్య అవివాహితుడు కావడంతో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. మిగిలిన సంతానంలో అందరికీ వివాహాలై వేర్వేరుగా ఉంటున్నారు. మతిస్థిమితం లేని తల్లి ఎప్పుడు గొణుగుతుండడం, తనకు వివాహం కాకపోవడంపై అసంతృప్తిగా ఉన్న నిందితుడు బాదరయ్య తెల్లవారుజామున మంచం మీద పడుకుని నిద్రిస్తున్న తల్లిని రోకలిబండతో కొట్టడంతో అక్కడికక్కడే ఆమె మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు గజ్జ శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అందజేశారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు వేళాయె!

- జిల్లావ్యాప్తంగా 24 పాఠశాలల్లో నోటిఫికేషన్ విడుదల
- 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో దరఖాస్తుల ఆహ్వానం
- ఏప్రిల్ 11వరకు స్వీకరణ



బెల్లంకొండ: బాలిక విద్యకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రవేశాలకు వేళయింది. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఆరవ తరగతి మరియు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సమగ్ర శిక్ష నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి గాను ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హులైన బాలికలు ఆరవ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందవచ్చు.

■ జిల్లావ్యాప్తంగా 24 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియంలో బోధించే ఈ విద్యాలయాల్లో ఆరవ తరగతిలో ప్రవేశాలకు ఒక్కో పాఠశాలలో 40 సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన ఈ విద్యా సంవత్సరం 960 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కో పాఠశాలలో ఒక ఇంటర్మీడియెట్ కోర్సు కేటాయించి బాలికలతో విద్యాభ్యాసం చేయిస్తున్నారు. ఒక్కొక్క కేజీబీవీలో 40 మంది చొప్పున ఇంటర్మీడియట్‌లో కూడా 960 సీట్లను భర్తీ చేస్తారు. అదేవిధంగా 7, 8, 9, 10 తరగతులతోపాటు, ఇంటర్ సెకండియర్ ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నారు.

■ అనాథ పిల్లలతో పాటు బడి బయట ఉన్న పిల్లలు, డ్రాప్ అవుట్స్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దారిద్య్రరేఖకు దిగువన జీవిస్తున్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఆరవ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదవ తరగతి చదివిన బాలికలై ఉండాలి. అదేవిధంగా ఇంటర్‌లో ప్రవేశాలకు పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలి.


■ కేజీబీవీలలో ఆన్‌లైన్‌లో https:/ apkgbv.apcfss. in/వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు సమయంలో సందేహాలు సమస్యల నివృత్తి కోసం ప్రభుత్వం హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. టోల్ ఫ్రీ నెంబర్ 18004258599 అందుబాటులో ఉంచింది.

బాలికలకు మంచి అవకాశం

కస్తూర్బా పాఠశాలల్లో బాలికలు చదువుకోవడానికి గొప్ప అవకాశం. ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా విద్యను అభ్యసించవచ్చు. ప్రభుత్వం అన్ని వసతులను కల్పిస్తూ నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందజేస్తుంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాలికలు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ పాఠశాలలు ఎంతో తోడ్పడతాయి. ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

– టి.వెంకట సుబ్బారావు, అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్, పల్నాడు జిల్లా

మొరాయిస్తున్న సాగర్ కుడికాలువ గేట్లు



కుడికాలువ హెడ్ రెగ్యులేటర్

మూడేళ్లకే మరమ్మతులకు లోనైన ఎనిమిదో గేటు

విజయపురిసౌత్: సుమారుగా 10.50లక్షల ఎకరాలకు సాగునీరందించే కుడి కాలువ గేట్లు మూడేళ్లకే మరమ్మతులకు లోనయ్యాయి. ఎనిమిదో గేటు కిందికి దిగకపోవడంతో గురువారం ఎమర్జెన్సీ గేటు ద్వారా దానిని మూసివేసి రెండో గేటు ద్వారా కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్‌కు మూడు గేట్లు ఉండగా, కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్‌కు 9 గేట్లు ఉన్నాయి. మూడేళ్ల క్రితం కుడి కాల్వ తొమ్మిదో గేటు కిందికి, పైకి జరుగకపోవడంతో బలవంతగా కిందికి దింపేందుకు ప్రయత్నం చేయగా ఊడిపోయి కాలువలోకి కొట్టుకు పోయింది. ఆ గేటును అమర్చకపోవటంతో చాలా రోజులు వరకు నీటి విడుదల కొనసాగింది. ఆ సమయంలోనే కుడి, ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద గల తూములకు కొత్తగేట్లకు టెండర్లు పిలిచారు. తొమ్మిదో గేటు మరమ్మతులు చేశాక అదే కంపెనీకి పనులు అప్పగించారు. కుడి హెడ్ రెగ్యులేటర్ గేట్లకు తొమ్మిదింటికిగాను రూ.3.30కోట్లు, ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ మూడు గేట్లకు రూ.2.50కోట్లు, సూట్ గేటుకు రూ.1.50కోట్లకు 2022లో టెండర్లు పిలిచి పనులు చేయించారు. అవికాస్త అప్పుడే మరమ్మతులకు గురైనట్లు సమాచారం. విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా కుడి కాలువకు నీటిని విడుదల చేయడంతో హెడ్‌రెగ్యులేటర్ గేట్లు అంతగా వినియోగించ లేదు. నీటి అవసరాల మేరకు ఎక్కువగా 2,9వ గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఇటీవలే ఈ రెండు గేట్లు మూసివేసి ఎనిమిదో గేటు ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం దానిని మూసేందుకు ప్రయత్నించగా కిందికి దిగలేదు. దీంతో ఇంజినీర్లంత శ్రమించి ఎట్టకేలకు మూసివేశారు. ప్రస్తుతం రెండో గేటు ద్వారా 3,031 క్యూసెక్కులు కుడి కాలువకు విడుదల చేస్తున్నారు. బుధవారం వరకు 4050 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

'వక్ఫ్' సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

- ముస్లిం మైనార్టీలకు అండగా నిలిచేది వైఎస్సార్ సీపీనే
- బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వడం మైనార్టీలకు వెన్నుపోటు పొడవటమే
- మాజీ సీఎం జగన్‌పై వర్లరామయ్య ఆరోపణలు సిగ్గుచేటు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: కేంద్రంలోని బీజేపీ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25, 26లను ఉల్లంఘించి ప్రవేశపెట్టారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వటమంటే మైనార్టీలకు వెన్నుపోటు పొడవటమేనన్నారు. ఈ బిల్లును వైఎస్సార్ సీపీ వ్యతిరేకించిందని, మైనార్టీలకు అండగా ఉండేది, వారికోసం నిలబడేది తమ పార్టీ నేనని గోపిరెడ్డి స్పష్టం చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ మైనార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లిమేతర వ్యక్తిని వక్ఫ్‌బోర్డు కమిటీలోకి తీసుకురావటం 26వ ఆర్టికల్‌ను ఉల్లంఘించటమేనన్నారు. ఇప్పటివరకు ముస్లిం వ్యక్తులే కమిటీలో ఉంటున్నారన్నారు. దీంతో ఆస్తులు అన్యాక్రాంతమవుతాయనే భయాందోళన ముస్లిం వర్గాల్లో వ్యక్తమవుతుందన్నారు.

మైనార్టీలను వంచించిన టీడీపీ, జనసేన..

వక్ఫ్‌బోర్డు ఆస్తులను ఆర్నెల్లలో సెంట్రల్ డేటా బేస్‌లోకి తీసుకురావటం సాధ్యమయ్యే పనికాదన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ అధికారులు ఏవిధంగా పనిచేస్తున్నారో అందరికీ తెలిసిందేనన్నారు. ప్రతి రాష్ట్రానికి ఒక అధికారిని కమిటీలో నియమిస్తున్నారని, ఆ అధికారిని రాష్ట్రమే నిర్ణయించటం వలన రాష్ట్రంవైపే ఆ అధికారి మొగ్గుచూపే అవకాశం ఉంటుందన్నారు. ఈ సవరణకు టీడీపీ, జనసేన మద్దతు ఇవ్వటంపై రాష్ట్రంలోని ప్రతి మైనార్టీసోదరుడు ఆవేదన చెందుతున్నాడన్నారు. రాష్ట్రంలో ఉన్న ఖరీదైన వక్ఫ్ ఆస్తులను ఏంచేయనున్నారోననే ఆందోళన ప్రతి ముస్లింకి ఉందన్నారు. దేశంలో సుమారు 20 కోట్లమంది ముస్లింలు ఉండగా వారికి ఆల్‌ఇండియా ముస్లిం లా బోర్డు, జమాయిత్ హిందూ ఉల్ అనే సంస్థలు ఉండగా వాటిని చర్చలకు ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఒక మతానికి చెందిన అంశాలను మార్చుతున్నప్పుడు ఆ మత పెద్దల అభిప్రాయాలు, సూచనలు ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. రంజాన్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు ఇచ్చిన ఇఫ్తార్‌ను ముస్లిం లా బోర్డు బహిష్కరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ముస్లింల హక్కులు కాలరాయకుండా వారితో ముందుగానే చర్చలు ఎందుకు జరపలేదని వైఎస్సార్ సీపీ ప్రశ్నిస్తుందన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందన్నారు.

వర్ల రామయ్య వ్యాఖ్యలు సిగ్గుచేటు

వర్లరామయ్య నరసరావుపేటకు వచ్చి బిల్లు విషయంలో తమ పార్టీ టీడీపీపై తప్పుడు ప్రచారం చేస్తుందని అన్నాడని, దీనిపై తాము ఆయనతో చర్చించేందుకు సిద్ధమేన్నారు. దీంతో పాటు మాజీ సీఎం వైఎస్ జగన్‌పై అవాకులు చవాకులు పేలడం సిగ్గుచేటన్నారు. టీడీపీ మద్దతు ఇవ్వకపోయినా బిల్లు పాస్‌అయ్యేదన్న వర్లరామయ్య మాటను ప్రస్తావిస్తూ మద్దతు ఇవ్వకపోయినా పాస్ అయినా మద్దతు ఇవ్వటమే ఇక్కడ ముఖ్యమైన అంశమన్నారు. ఇమామ్, మౌజమ్‌లకు రూ.10వేలు, రూ.5వేలు పారితోషికం అందజేసింది జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి హజ్ యాత్రకు వెళ్లే అవకాశం కల్పించారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ అవకాశాన్ని రద్దుచేసిందన్నారు. దివంగత వైఎస్సార్ ఇచ్చిన 4శాతం రిజర్వేషన్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వలన ఎంతో మంది మైనార్టీలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారని, నరసరావుపేట మండలంలోని చినతురకపాలెంలో పేద బడుగు ముస్లిం కుటుంబాలకు చెందిన 32మంది యువతీయువకులు ఎంబీబీఎస్ చదువుకొని డాక్టర్లు అయ్యారని, వారిలో ఎనిమిదిమంది పీజీలు చదువుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేధింపులకు గురైన బాలిక ఆస్పత్రికి తరలింపు



చిలకలూరిపేటటౌన్: బాలికపై కన్నతల్లే కర్కశంగా వేధించిన కేసులో బాలల హక్కుల పరిరక్షణ అధికారులు స్పందించారు. పట్టణంలోని ఈనెల 31వ తేదీన ఏడాది కిందట భర్తతో విడిపోయి ప్రియుడితో సహజీవనం చేస్తున్న దీప్తి తన కుమార్తెను వేధింపులకు గురిచేసిన విషయం విధితమే. బాధిత బాలికను పరామర్శించి ఐసీడీఎస్ సీడీపీఓ, మహిళ పోలీస్, డీసీపీఓ వివరాలను సేకరించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్, మహిళ పోలీస్ ఆధ్వర్యంలో బాలికను గుంటూరు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. అనంతరం నరసరావుపేట బాలల సదన్‌లో చేర్పించనున్నట్లు వారు వెల్లడించారు.

పంపిణీ చేసే ఇళ్ల స్థలాల పరిశీలన



మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో స్కూలు వద్ద శుక్రవారం పంపిణీ చేసే ఇళ్ల స్థలాలను శుక్రవారం ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్థల పట్టాల పంపిణీని ప్రారంభించనున్న నేపథ్యంలో ఎస్పీ పరిశీలన జరిపారు. అధికారులకు భద్రతా సూచనలు చేశారు. ట్రాఫిక్, , వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ వై. శ్రీనివాసరావు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



వేమూరు: మండలంలోని చంపాడు ఇరిగేషన్ కాలువ వంతెన వద్ద ఇసుక ట్రాక్టర్‌ను లారీ ఢీకొంది. వివరాలు మేరకు... కొల్లూరు మండలంలోని గాజులంక నుంచి తెనాలికి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. పోలీసు స్టేషన్‌లో ముడుపులు చెల్లించడంతో రాత్రి వేళ తిరిగే లారీలు, ట్రాక్టర్ల యజమానులపై పోలీసులు కేసు నమోదు లేదు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున గాజులంక గ్రామం నుంచి ఇసుక లోడుతో ట్రాక్టర్, లారీ బయలుదేరాయి. చుంపాడు ఇరిగేషన్ కాలువ వంతెన వద్ద ట్రాక్టర్‌ను లారీ ఢీకొని పడిపోయింది. వంతెన వద్ద ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అక్రమ ఇసుక విషయం తెలుసుకున్న తెలుగు దేశం పార్టీ నాయకులు ఘటనాస్థలం వద్దకు చేరుకుని ఇసుక లారీని తొలగించారు. సీఐ మాట్లాడుతూ దీనిపై స్టేషన్‌లో ఫిర్యాదు అందలేదన్నారు.

ఒప్పుకున్నా.. ఒప్పుకోకపోయినా

పైపులైన్ పనులు ఆగవు

- పోలీసుల భద్రతలో పూర్తిచేస్తాం
- బీపీసీఎల్ పైప్‌లైన్ ఏర్పాటుపై రైతులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీదేవి
- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన మూడు గ్రామాల రైతులు



బీపీసీఎల్ పైపులైన్ భూ వినియోగం గురించి రైతులకు వివరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీదేవి

నకరికల్లు: ఒప్పుకున్నా లేకున్నా పోలీస్ ప్రొటెక్షన్ తీసుకొని పైపులైన్ చేపడతామని అధికారులు రైతులను హెచ్చరించారు. బీపీసీఎల్ పైపులైన్ ఏర్పాటులో భాగంగా మండలంలోని చల్లగుండ్ల, నకరికల్లు, నర్సింగపాడు గ్రామాల రైతులతో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.శ్రీదేవి మాట్లాడుతూ బీపీసీఎల్ పైపులైన్ ఏర్పాటుకు భూములు తీసుకునేది భూసేకరణ కిందకు రాదని భూ వినియోగం మాత్రమేనన్నారు. గుర్తించిన భూమిలో ఆరుమీటర్ల లోతులో ఒకటిన్నర మీటరు వెడల్పులో పైపులైను ఏర్పాటు ఉంటుందన్నారు. పైపులైను పనులు చేపట్టేందుకు 18 ఇంటు 18మీటర్ల వెడల్పులో భూమిని వినియోగించుకొని పైపులైన్ పూర్తయ్యాక భూమిని యథావిధిగా బాగు చేసి ఇస్తామన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంట పూర్తయ్యాకే పనులు చేపతామన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్న భూముల విలువను బట్టి రెండున్నర రెట్లు కలిపి మొత్తం సెంటుకు రూ12వేలు చొప్పున రైతులకు చెల్లిస్తామని తెలిపారు. దీనికిగాను రైతులు అంగీకారపత్రం ఇవ్వాలని ఒకవేళ ఒప్పుకోకుంటే ఇది కేంద్రప్రభుత్వం ప్రాజెక్టు అని పోలీస్ బందోబస్తు నడుమ అయినా పూర్తిచేసి తీరాల్సి వస్తుందని హెచ్చరించారు.

డిమాండ్లకు ఒప్పకొంటేనే భూములిస్తాం..

పైపులైను వేసిన భూముల్లో గోడౌన్‌లు కట్టుకోవాలన్నా... ప్లాట్లు వేసుకోవాలన్నా... అమ్ముకోవాలన్నా, భూమిలో పైపులైన్లు ఉండడం మూలంగా ఇబ్బందులు తలెత్తుతాయని, పనులు చేపట్టే క్రమంలో భూమిని పంటకు పనికిరాకుండా చేస్తారని, హద్దురాళ్లు చెల్లాచెదరు చేస్తారని రైతులు వాపోయారు. హామీలు నెరవేరుస్తామని రాతపూర్వకంగా ఇవ్వాలని, అలాగే సెంటుకు రూ.20వేలు పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే భూములు ఇచ్చేందుకు ఒప్పుకోమని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పనులు చేపట్టిన 105 గ్రామాల్లో సెంటుకు రూ 2వేలు చొప్పున మాత్రమే ఇచ్చారని, ఇక్కడి రైతుల కోసం రూ 12వేలు ఇస్తున్నారన్నారు. తహశీల్దార్ కె.పుల్లారావు, బీపీసీఎల్ ప్రాజెక్టు లీడర్ భగవాన్ శుక్లా, సైట్ ఆఫీసర్ అమిత్‌కాంబ్లో, సైట్ ఇన్‌చార్జి పవన్, వీఆర్వోలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.



అధికారుల ఎదుట అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న మూడుగ్రామాల రైతులు

టీడీపీ నేత నిమ్మతోటలో గంజాయి మొక్కలు

- రాజుపాలెం మండలం మొక్కపాడులోని తోటలో పెంపకం
- గంజాయి పచ్చి ఆకు కలిగిఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- టీడీపీ నేత దొడ్ల సాంబయ్యపై చర్యలకు తాత్సారం

నరసరావుపేట: గంజాయి ఆకు అమ్ముతున్నారని ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన రాజుపాలెం మండలంలోని మొక్కపాడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన రేఖనారు నీల్‌కుమార్, మొగిలి శివయ్య, దేవర ఏడుకొండలు పచ్చి గంజాయి ఆకును బ్యాగ్‌లో తరలిస్తుండగా పోలీసులు కాపుకాసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద సుమారు నాలుగు కేజీల పచ్చి గంజాయి ఆకు ఉన్నట్లు గుర్తించి, ముగ్గురిని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారిని విచారించగా గ్రామానికి ఉత్తరం వైపున గల దొడ్ల సాంబయ్య నిమ్మతోటలో గంజాయి మొక్కలు ఉన్నట్లు వారు తెలిపారు. గురువారం పోలీసులు నిమ్మతోటను పరిశీలించగా గంజాయి మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. నిమ్మతోట యజమాని దొడ్ల సాంబయ్య తెలుగుదేశం పార్టీ నాయకుడు కావడంతో అతణ్ణి పోలీసులు స్టేషన్‌కు తీసుకురాకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారు. పచ్చి ఆకు కావడంతో నిపుణులు వచ్చి పరీక్షించిన తరువాత గంజాయి ఆకుఅని తేలితే కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఘటనపై ఇంతవరకు కేసు నమోదు కాలేదు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్

నూజెండ్ల: వ్యక్తి హత్యాయత్నానికి పథకం రచించిన సెల్‌ఫోను వాయిస్ రికార్డు బయటపడటంతో ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.వి.కృష్ణారావు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అల్లీభాయిపాలెం గ్రామానికి చెందిన కర్ణాటి వెంకటరావు అదే గ్రామానికి చెందిన మీరావలీ మధ్య నగదు లావాదేవీలు ఉన్నాయి. వెంకటరావు దగ్గర మీరావలీ అప్పుగా కొంత నగదు తీసుకున్నాడు. ఈ విషయంలో ఇరువురు మధ్య అభిప్రాయబేధాలు వచ్చాయి. అప్పు తీర్చక పోగా కర్ణాటి వెంకటరావును హత్య చేసేందుకు ప్రణాళిక రచన చేశాడు. ఈక్రమంలో పాటకోట లాలయ్య, గద్వాల మీరావలీ, బ్రహ్మం, దూదేకుల దస్తగిరితో కలిసి చంపాలని నిర్ణయించుకొని దానికి తగిన నగదు ఇవ్వటానికి మీరావలి ఒప్పందం చేసుకున్నాడు. ఈ పథకం విషయమై జరిగిన సంభాషణలు వారిలో ఒకరు రికార్డు చేశారు. వాయిస్ రికార్డు లీక్ అవటంతో కర్ణాటి వెంకటరావు అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా వాస్తవమని పోలీసులు నిర్ధారణ చేసి నిందితుడు మీరావలితో పాటు నలుగురిని అరెస్ట్ చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఎంవీ కృష్ణారావు తెలిపారు.

పురుగుమందు తాగి మహిళ ఆత్మహత్య

బొల్లాపల్లి: పురుగుమందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. బండ్లమోటు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి మండలం కంద్రిక గ్రామానికి చెందిన బైలడుగు రమణ(45) మద్యానికి బానిసైన భర్తను బెదిరించేందుకు గత నెల 29వ తేదీన పురుగుల మందు తాగింది. వెంటనే బంధువులు వినుకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భర్త చిన్న బాదరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ జె.భాస్కరరావు తెలిపారు.



మృతురాలు బైలడుగు రమణ

రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారమే దాడులు

- మోటారు సైకిళ్లపై మాజీ సీఎం జగన్ బొమ్మ పెట్టుకున్నా తట్టుకోలేక పోతున్నారు
- ఉద్దేశపూర్వకంగా దాడులు
- వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్



మాట్లాడుతున్న ఎం.ఎన్.ప్రసాద్

వినుకొండ: దేశంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం మాత్రమే ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ బుక్ రాజ్యాంగం మాత్రమే అమలవుతోందని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ ఆళ్ల సాంబిరెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఎం.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ కూటమి నేతలు నేరపూరిత, ఘర్షణ వాతావరణాన్ని ప్రోత్సహిస్తున్నారు కాబట్టే తాము రెడ్‌బుక్ రాజ్యాంగం అంటున్నామన్నారు. ఇటీవల బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు గ్రామంలో ఆళ్ల సాంబిరెడ్డి, ఆళ్ల పాపిరెడ్డిలపై టీడీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారని, వారి ఇళ్లపై కూడా దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనను స్థానిక టీడీపీ నేతలు కూడా ఖండించారని గుర్తు చేశారు. ప్రశ్నిస్తే దాడులు చేయడం ఏ రాజ్యాంగంలో ఉందని, గ్రామాల్లో భావప్రకటన స్వేచ్ఛ కూడా లేకుండా మోటారు సైకిళ్లపై మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రం కనిపిస్తే ఆ బళ్లు ధ్వంసం చేయడం, అకారణంగా దాడులు చేయడం కూటమి నేతలకు పరిపాటిగా మారిందన్నారు. టీడీపీకి వ్యతిరేకంగా ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులను గుర్తించి కేసులు నమోదు చేయడం, వేధించడంతో పాటు ఇరువర్గాల ఘర్షణలో కూడా ఒక వర్గం వారికి స్టేషన్ బెయిల్, మరో వర్గం వారిపై 307కేసులు నమోదు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇది రెడ్‌బుక్ రాజ్యాంగం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాజ్యాంగ బద్ధంగా పరిపాలన చేయాలని అన్నారు.

గ్రామాల్లో ఘర్షణలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం...

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అమ్మిరెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కక్షాపూరిత వాతావరణాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, చిన్నచిన్న ఘర్షణల్లో కూడా పోలీసులు తలదూర్చి కేసులు నమోదు చేయడం తాము ఎక్కడా చూడలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక నానా ఇబ్బందులు పడుతుంటే ఆ సమస్యలు పట్టించుకోకుండా గ్రామాల్లో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడం ఏంటని ప్రశ్నించారు. బాధితుడు సాంబిరెడ్డి మాట్లాడుతూ అకారణంగా తమ కుటుంబంపై దాడి చేసి తన జేబులో సెల్‌ఫోన్ లాక్కొన్నారన్నారు. అదేమని ప్రశ్నించినందుకు తమ కుటుంబంపై మూకుమ్మడిగా దాడికి తన కన్నతల్లిపై కూడా దాడి చేశారన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన గెలుపు కోసం పనిచేశానని, తనపై జరిగిన దాడిని టీడీపీ నాయకులు వక్రీకరించడం బాధాకరమని అన్నారు. పార్టీ బొల్లాపల్లి మండల అధ్యక్షుడు బత్తి గురవయ్య, వినుకొండ అధ్యక్షులు దండు చెన్నయ్య, మన్నెయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం తగదు

- డీపీఓ విజయభాస్కర్‌రెడ్డి
- ఇద్దరు కార్యదర్శులకు మెమోలు



కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ

నాదెండ్ల: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణపై కార్యదర్శులు అలసత్వం వహించకుండా పనిచేయాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి చెప్పారు. పలు గ్రామాల్లో గురువారం ఆయన పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘనవ్యర్థాల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుక్కాపురంలో రోడ్ల వెంబడి చెత్త కుప్పలు ఉండటం, పారిశుధ్య నిర్వహణపై గ్రామస్తులు పలు ఫిర్యాదులు ఆయన దృష్టికి తేవటంతో కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో జారీ చేశారు. ఎండుగుంపాలెం గ్రామంలో ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించి పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శికి మెమో జారీ చేశారు. జంగాలపల్లెలో స్వామిత్వ సర్వే చివరి దశలో ఉండటంతో కార్యదర్శికి పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల కార్యదర్శులతో ఇంటి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఇకనుంచి అన్ని గ్రామాల్లో 22 అడుగుల వెడల్పుతో రోడ్లు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నిర్మలా లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

నేటి నుంచి యడ్లపాడు ‘కళా సంబరం’

- 4,5,6 తేదీల్లో నిర్వహణ.. ప్రదర్శనకు రానున్న 10 నాటికలు
- పండుగ వాతావరణంలో పల్లె వీధులు



ముస్తాబైన కళావేదిక

యడ్లపాడు: కళల పండుగకు వేళయింది. యడ్లపాడు గ్రామం ఇందుకు వేదికైంది. పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 4,5,6 తేదీలలో జరిగే ఈ సంబరాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని రంగస్థల కళాకారులు తమ ప్రదర్శనలతో కళాభిమానుల్ని మంత్రముగ్ధుల్ని చేయనున్నారు. మూడు రోజులు జరిగే ఈ పోటీలకు 10 నాటికలను ప్రదర్శించి కళావిందు చేయమన్నారు.

రంగస్థల ప్రియులకు పండుగ



ఈసారి నాటికల పోటీలు రంగస్థల ప్రియులకు పర్వదినాలుగా మారనుంది. దాతలు, అతిథులు, కళాకారులకే కాదు గ్రామంలోని గడపగడకు ఆహ్వాన పత్రాలు, కూపన్లు ఇస్తున్నాం. ప్రదర్శనలకు వచ్చే ప్రతి ప్రేక్షకుడికి రోజుకో వెరైటీ అల్పాహారం, రోజు 30 మంది చొప్పున 3 రోజులు లక్కీడ్రా తీసి 90 మందికి ఆకర్షణీయమైన బహుమతులు ఇవ్వనున్నాం. ప్రతి నాటికను యూట్యూబ్, షోషల్ మీడియా ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నాం. దీని ప్రత్యేక లింకును ప్రదర్శనకు 2గంటల ముందు అందరికీ చేరుస్తాం. నటీమణులకు సారెతో ఆడుపడుచు సత్కారం ఇస్తాం.

– డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షుడు

జాబ్ కార్డులను తొలగించడం అన్యాయం



ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు

అమరావతి: యాక్టివ్‌గా లేవనే సాకుతో జాబ్ కార్డులను తొలగించడం అన్యాయమని జాబ్ కార్డుతో సంబంధం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికీ పని చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రవిబాబు అన్నారు. గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు తెలుసుకోవటం కోసం నిర్వహించిన ఉపాధి హామీ బైక్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాలలోఉపాధి హామీకూలీలు తమ సమస్యలను బైక్‌యాత్రలో వ్యవసాయ కార్మికసంఘ ప్రతినిధులకు వివరించారు. రవిబాబు మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పనులుచేసిన కూలీలు కూడా ప్రస్తుతం జాబ్ కార్డులు యాక్టివ్‌గా లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. జాబ్ కార్డులు లేక, పనులకు వెళ్లలేక అనేకమంది కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆధార్‌కార్డుకు బ్యాంకు ఎకౌంటుకి ఫోన్ నెంబర్లకు లింకులు లేకపోవటం కూడా పెద్ద సమస్యగా మారిందన్నారు. నిరక్షరాశ్యులైన కూలీలకు ఫోన్‌నంబరు లింక్‌చేయటంపై అవగాహన లేక చేసిన పనికి వేతనాలు అందక కూలీలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించి, కూలీలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం నాయకులు జమ్ములమూడి భగత్, ఏపూరి వెంకటేశ్వర్లు యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిపై టీడీపీ శ్రేణుల దాడి



గాయపడిన శ్రీనివాసరెడ్డి

లంకెలకూరపాడు(ముప్పాళ్ల): ముప్పాళ్ల మండలం లంకెలకూరపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిపై అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు దాడికి దిగిన సంఘటన గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామంలోని వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడైన మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొంత కాలంగా నరసరావుపేటలో నివాసముంటున్నాడు. మాజీ సర్పంచ్ వర్ధంతి కార్యక్రమానికి గ్రామానికి వచ్చాడు. పాతకక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి(పెదకాపు), అతని కుమారుడు బ్రహ్మారెడ్డి, కిష్టిపాటి లింగారెడ్డిలు విచక్షణారహితంగా దాడి చేశారు. ముఖంపైన తీవ్ర గాయాలు కావటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేస్తుండగా స్పృహ కోల్పోవటంతో మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గాయపడిన శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఆసుపత్రిలో పరామర్శించారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్



జూలకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

పిడుగురాళ్ల: వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పి.విజయ్‌కుమార్ సూచించారు. పిడుగురాళ్ల పట్టణ, గ్రామీణ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో రూరల్ విద్యుత్ శాఖ కార్యాలయంలో గురవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ... విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గించాలని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. కరెంట్ బిల్లుల వసూళ్లలో అలసత్వం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ పరిధిలోని జానపాడు, రూరల్ పరిధిలోని జూలకల్లు సబ్ స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించారు. వేసవిలో లోడ్ పెరుగుతున్న కారణంగా దానికి అనుగుణంగా విద్యుత్ శాఖ సిబ్బంది సిద్ధంగా ఉండి అంతరాయాలు లేకుండా విద్యుత్‌ను అందించాలని ఆదేశించారు. 50 శాతం అదనపు లోడ్ సబ్సిడీ స్కీమ్‌ను గృహ వినియోగదారులందరు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులతో పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.నాగసురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సింగయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు ఎగ్గొట్టేందుకే తప్పుడు కేసు



మాట్లాడుతున్న అమరా ఇంజినీరింగ్ కాలేజీ బాధితులు ఏలూరి ప్రసాద్, తదితరులు

నరసరావుపేటటౌన్: బాకీ డబ్బులు ఎగ్గొట్టేందుకు తప్పుడు కేసు పెట్టి వేధిస్తున్నారని ఏలూరి ప్రసాద్ విమర్శించారు. గురువారం ప్రకాష్‌నగర్ సిరి అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అమరా వెంకటేశ్వరరావు బాధితులతో కలిసి మాట్లాడారు. పట్టణానికి చెందిన అమరా వెంకటేశ్వరరావు అమరా ఇంజినీరింగ్ కాలేజీ నిర్వహిస్తూ ఆర్థిక సమస్యలతో 2023లో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అతనికి సన్నిహితంగా ఉండే వారి వద్ద సుమారు రూ.10 కోట్లు అప్పుగా తీసుకొని ఇంజినీరింగ్ కాలేజీ నిర్మించాడన్నారు. కాలేజీని కోర్టు వేలం వేసి బ్యాంకుకు చెల్లించవలసిన పైకం పోనూ మిగిలిన మొత్తాన్ని సొసైటీ పేరిట సుమారు రూ.4 కోట్లు బ్యాంకులో డిపాజిట్ చేశారన్నారు. వెంకటేశ్వరరావు మృతి అనంతరం ఆయన భార్య అమరా సుధారాణి, వారి పిల్లలు బాకీదారులతో సన్నిహితంగా ఉంటూ ఉన్న ఆస్తిని అమ్మి బాకీలు తీరుస్తామని నమ్మబలుకుతూ వచ్చారన్నారు. ఇటీవల నరసరావుపేటలో ఐపీ పెట్టే వారి సంఖ్య పెరగటంతో వీళ్లు కూడా డబ్బులు ఎగ్గొట్టాలని దురాలోచన చేశారన్నారు. అందులో భాగంగానే బుధవారం సుధారాణి తమపై తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించి నిజానిజాలు తెలుసుకొని తగిన న్యాయం చేయవలసిందిగా కోరారు. సమావేశంలో కండె హనుమంతరావు, కూరపాటి శ్రీనివాస గుప్తా, కొత్తూరు సురేషు, పెనుగొండ ప్రతాపు, పెనుగొండ ప్రభాకర్, సీతారామయ్య, చీరాల నారాయణ, ఇక్కుర్తి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.